




ముందుమాట

నా పదహారో యేట నుంచీ డైరీలు వ్రాస్తున్నాను. అప్పట్లో ఎందుకు వ్రాయాలనిపించిందో, స్ఫూర్తి ఏమిటో ఇప్పుడు నాకు గుర్తులేదు. కాగా, అప్పటి జీవితంలో వ్రాసే విశేషాలు తక్కువ. వ్రాతకి 'విశేషం'లేదు. ఏదో పొడి పొడి వాక్యాలతో సాగేవి పేజీలు. క్రమంగా చెప్పడంలో 'రుచి' మరిగి, చెప్పే విషయంలో విశేషం కలిసిరాగా చెప్పవలసిన వ్యక్తుల ప్రాచుర్యమూ పెరిగి డైరీలు బరువునీ, బలాన్నీ సంతరించుకున్నాయి.

ముందుకు సాగడమేకాని వెనక్కి తిరిగి చూసుకోవడం అలవాటులేని నాకు "వెనక్కి తిరిగి చూసినవీ చేసినవీ చెప్పండి" అనే మిత్రులు ఎక్కువయారు. తీరా వెనక్కి తిరిగి చదివితే చాలా చెప్పగలిగినవీ, చెప్పవలసినవీ, చెపితే పదిమంది ఆనందించేవీ చాలా ఉన్నాయనిపించింది. ఈ అనుభవాల సమాహారమే ఒక జీవితం - నా జీవితం.

వారందరి గురించీ చెప్పడం నా గురించీ కొంత చెప్పడమే అవుతుంది. నేను ఇప్పటికీ 'నేను'లాగే ఉండడానికి ఎప్పటికప్పుడు ఎందరి వ్యక్తుల చేయూతో, మందలింపో, హితవో, పాఠమో కలిసి వచ్చిందని చెప్పడమూ అవుతుంది. వెరసి నా ఆత్మకథ అవుతుంది.

ఎవరి గురించి వారు చెప్పుకోవడం సరదాగానే ఉంటుంది. 'గొప్ప'గా చెప్పుకోవడం 'మత్తు'గానూ ఉంటుంది. కాని యిక్కడ గొప్పలు కాక - నా చుట్టూ ఉన్న గొప్పవారు చెప్పినవీ. గొప్పగా చెప్పినవీ ఉటంకించే 'యావ'తో నా గురించి చెప్పక తప్పలేదు. అది పువ్వుతో ఉన్న దారం అదృష్టమని మాత్రం సరిపెట్టుకుని, వారి ఔదార్యాన్ని చెప్పే నా వ్యామోహం మాత్రమేనని మీరు అర్థం చేసుకుంటే చాలు.

నేను ముందు తరాలకి అడుగుజాడలు వదిలే మహాత్ముడిని కాను. గుణపాఠాలు చెప్పే వేత్తనీ కాను. నా జీవితం ఎవరికీ మార్గదర్శకం కాదు. నాది కనువిప్పు కలిగించే జీవనసరళి అనను. నేను ఆదర్శమూర్తినికాను. అవతారపురుషుడిని కాను.

కాని గత 56 సంవత్సరాలలో అన్ని ప్రసార, ప్రచార మాధ్యమాలలో పత్రిక, రేడియో, టెలివిజన్, సినిమా వేదిక యిన్నింటిలో తలమునకలయిన వాడిగా - మూడు తరాల ప్రముఖులతో భుజాలు రాసుకుని పనిచేసినవాడిగా నేను కన్నవీ, విన్నవీ, తెలుసుకొన్నవీ, తెలుసుకోవాలనుకున్నవీ, చేసినవీ, చేయాలనుకున్నవీ నిజాయితీతో మీ ముందుంచితే ఆ

పేజీలలోంచి ఓ మిత్రుడో, హితుడో, జిజ్ఞాసో, అదృష్టవంతుడో, అభాగ్యుడో రూపుదిద్దుకుంటాడు - ఆ రూపం పేరు గొల్లపూడి మారుతిరావు.

అతని కథ - అమ్మ కడుపు చల్లగా .

ఈ కథ వ్రాయడానికి నన్ను ఉసిగొల్పిన చాలామందిలో నేను చెప్పే విషయాలూ, తీరూ విని "మీరు ఆత్మకథ ఎందుకు వ్రాయకూడదూ" అన్న మహేష్‌భట్ ఉన్నారు.

నా షష్టిపూర్తి సత్కార్య సంచికలో 'ఆత్మకథ' రుచిని పదిమందికీ పంచి నన్ను వ్రాయమని రెచ్చగొట్టిన భరాగో ఉన్నారు.

తన "ఇన్‌సైడర్" గ్రంథాన్ని నా చేతిలో ఉంచి "తీరిక దొరికినప్పుడల్లా వ్రాస్తూండండి. తరువాత సవరణలు చేసుకోవచ్చు. నేనలా చెయ్యకపోతే ఈ గ్రంథం వచ్చేదికాదు. నిజానికి ప్రతీరోజూ పదిలైన్లయినా వ్రాయండి" అని ప్రోత్సహించిన మాజీ ప్రధాని పి.వి నరసింహారావుగారూ ఉన్నారు.

వెరసి - ఈ ప్రయత్నం

ఎంత డైరీలను నమ్ముకున్నా, విషయాన్ని విశ్లేషించడంలో ఎక్కడయినా సమాచారంలో పొరపాట్లు దొర్లితే, వివరణలో లోపాలు కనిపిస్తే తెలియజేస్తే కృతజ్ఞతతో దిద్దుకుంటాను.



# ప్రస్తావన

*1970 సెప్టెంబరు 8*

విజయవాడ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఆంధ్ర నాటక కళాపరిషత్ నాటకోత్సవాలు జరుగుతున్నాయి. నాటక రంగాన్నీ, సాహితీ రంగాన్నీ, కళారంగాన్నీ సుసంపన్నం చేసిన, చేస్తున్న ఎందరో మహనీయులు ఆనాటి ప్రేక్షకుల్లో ఉన్నారు. కె.వి.గోపాలస్వామి, పసల సూర్యచంద్రరావు, సురభి పూర్ణిమ, ఎం.ఆర్ అప్పారావు. కె. రామలక్ష్మి. దాడి గోవిందరాజులు నాయుడు, పోలవరపు సూర్యప్రకాశరావు, సుంకర కనకారావు, కొర్రపాటి గంగాధరరావు, కొడాలి ఆదిశేషయ్య, మందపాటి రామలింగేశ్వరరావు, శ్రీపాద పట్టాభి, ప్రభాకర గుప్తా ఇంకా ఎన్నో నాటక సమాజాలూ, నటులూ.

ప్రేక్షకుల్లో జంధ్యాల, ఎం.వి.యస్ హరనాథరావు, నూతన్‌ప్రసాద్ వంటి నటులున్నారు. ఉదయం ప్రదర్శనకు తెరలేచింది. నాటకం పేరు "కరుణించని దేవతలు" రచయిత పేరు గొల్లపూడి మారుతిరావు.

సనత్‌నగర్ సాంస్కృతిక సమాఖ్య ప్రదర్శన అది. ఎం.వి.రామారావు, గూడూరు సావిత్రి, బి.వి.రామారావు, ఇ.సీతారామయ్య నటీనటులు. నాటకం ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. తెలియకుండానే చాలామంది కళ్ళవెంట కన్నీరు చిమ్మింది. మూడో సీనుకి ప్రేక్షకులు దిగ్భ్రాంతులయారు. పెళ్ళి చేసుకున్న భార్య తనకి చెల్లెలవుతుందని తెలిసింది. ప్రేక్షకులు ఈలలు వేస్తారా? తిరగబడతారా? చిన్న టెన్షన్. ఏమీ కాలేదు. కొయ్యబారిపోయారు. ఈడిపస్ కాంప్లెక్స్ నాటకాన్ని పదునైన ఆయుధాన్ని చేసింది. విధి కత్తులు దూసింది. నాటకం అత్యంత విషాదంగా ముగిసింది. తెరపడింది. కొన్ని క్షణాలు ఎవరూ కుర్చీల్లోంచి కదలలేదు. తర్వాత లేచి ఎవరి దారి వారు వెదుక్కున్నారు. స్తబ్దమయిన ప్రేక్షకలోకమది.

అదే వేదిక. సాయంత్రం. "కళ్ళు" నాటిక ప్రదర్శన. రచయిత గొల్లపూడి మారుతిరావు. నాటికలో 'ధ్వని ' ప్రేక్షకుల్ని షాక్ అయేటట్లు చేసింది. ప్రతీ సంభాషణా ప్రేక్షకుల్లోంచి దూసుకుపోయింది. చప్పట్లు మిన్నుముట్టాయి. ఆనందంతో హాహాకారాలు చేశారు. నాటిక పూర్తయేసరికి ఇది పోటీ నాటకమని అంతా మరచిపోయారు. నటులంతా ఏకమయి, ఒక ప్రవాహమయి గొల్లపూడి మారుతిరావుని భుజాల మీద ఎత్తుకున్నారు. ఇన్‌స్టిట్యూట్ అంతా ఊరేగించారు. అదొక వెల్లువ. ఒక నాటక రచయితకి నాటక సంస్థలూ, నటులూ కలిసి చేసిన అపూర్వమయిన సత్కారం. పోటీల్లో గొప్ప నాటకానికి స్పందన రావచ్చు. కాని ఆనందం పరవశమయి, ఆవేశం కట్టలు తెంచుకుని నటులంతా ఏకమయి బ్రహ్మ రథం పట్టిన అనూహ్యమయిన సత్కారం ఇది. నాటక పోటీల చరిత్రలో ఎన్నడూ ఎంత గొప్ప ప్రదర్శనకీ ఇటువంటి స్పందనని చూడలేదు .కళ ఆనందానికి ఎల్లలను చెరిపేస్తుంది.

అయితే చరిత్ర ఇంకా ముందుంది. మారుతిరావుకి యూనివర్శిటీ డిగ్రీ ఇచ్చిన గురువుగారు అప్పటి ఆంధ్రా యూనివర్శిటీ రిజిష్ట్రారు కె.వి గోపాలస్వామిగారు అతన్ని కారెక్కించుకున్నారు. ఆ తెల్లవారుఝామునే బహుమతి ప్రదానోత్సవం. పోటీఫలితాలను ప్రకటిస్తారు. మిత్రులు మారుతిరావుని హెచ్చరించారు. గోపాలస్వామిగారు మారుతిరావుకి స్వయంగా విందు చేశారు. ఆయన మైమరచిపోయారు ఆనందంతో. మారుతిరావూ మైమరచిపోయాడు మత్తుతో. ఏ రాత్రికో రైల్వే ఇన్‌స్టిట్యూట్‌కి వచ్చి బయట పచ్చికలో నిద్రపోయాడు.

పోటీలు ముగిశాయి. ఫలితాలు ప్రకటిస్తున్నారు. మిత్రులు మారుతిరావుకోసం వెదికారు ఆతృతగా. పచ్చికలో నిద్రపోతున్న మారుతిరావుని ఎవరో లేపారు.

ఫలితాలు బయటికి వినిపిస్తున్నాయి. నాటకాలకు ఉత్తమ రచన బహుమతి: కరుణించని దేవతలు. నాటికలకు ఉత్తమ రచన బహుమతి కళ్ళు. ఉత్తమ నటుడు (నాటకాలు): ఎం.వి రామారావు. ఉత్తమనటి (నాటకాలు) గూడూరు సావిత్రి. నాటికలు: ఉత్తమ ప్రదర్శన: కళ్ళు. ఉత్తమనటుడు: ఎం. వాసుదేవమూర్తి (రెండు రెళ్ళు ఆరు).

స్టేజి మీద ఎం.ఆర్ అప్పారావుగారు, శ్రీపాద పట్టాభి ఉన్నారు. అందరి ముఖాల్లో చిరునవ్వులు వెలుగుతున్నాయి. మారుతిరావు వొంటిమీద పచ్చిక ఎవరో దులిపారు. వేదికమీదకి వచ్చాడు. కప్పులు అందిస్తూ పట్టాభి మారుతిరావుని తిట్టాడు. కెమెరాలు చిరునవ్వుల్నే వడబోస్తున్నాయి. తెల్లారాక అన్ని పత్రికల్లో ఆ ఫోటోలే మొదటి పేజీల్లో దర్శనమిచ్చాయి.

బహుమతి ప్రదానోత్సవం తర్వాత మళ్ళీ నటులంతా మారుతిరావుని భుజాల మీదకి ఎత్తుకున్నారు. ఈసారి అతని

నాటకాలు ప్రదర్శించిన నటులూ చేరారు. బహుమతులు రానివారూ, వచ్చిన వారూ అన్న తేడా లేదు. పరిషత్తు ప్రారంభించిన తర్వాత ఇన్ని దశాబ్దాల చరిత్రలో నాటకాలకూ, నాటికలకూ నిర్దేశించిన రెండు న్యాయ నిర్ణేతల బృందాలు - ఒకే రచయితకు నాటకాలకూ, నాటికలకూ ఉత్తమ రచన బహుమతులివ్వడం చరిత్ర. ఆ సందర్భాన్ని నాటక రంగానికే పండగని నటలోకమంతా కలసి చెయ్యడం మరొక చరిత్ర.

"నాటక రంగానికి ఓ కొత్త ఆలోచనని తెచ్చారు మారుతిరావుగారు" అన్నారు ఎం.ఆర్.అప్పారావుగారు. కొమ్మూరి వేణుగోపాలరావు, ఉషశ్రీ మారుతిరావు మీద వ్యాసాలు వ్రాశారు. ప్రేక్షకుల్లో హరనాథరావు వంటి రచయితలు ఈ సందర్భాన్ని ఆదర్శం చేసుకుని ముందు ముందు పోటీలు పడ్డారు.

ఒక రచయిత జీవితంలో అదొక మైలురాయి. ఆ జీవితం నిరంతర స్రోతస్వినిగా అలా కొనసాగుతూనే ఉంది. అది 'ఒకే' మైలురాయి కాకుండా జాగ్రత్త పడింది. అది కూడా 'ఒక' మైలురాయి  అనిపిస్తూ ముందుకు సాగింది. జీవితం వివిధ శాఖల్ని ఆవిష్కరించింది. మారుతిరావు తనని తాను జయించుకుంటూ, తనని తాను ఓడించుకుంటూ ముందుకు సాగాడు. రావిచెట్టు ఆకాశాన్ని చూస్తూ వ్యాపించదు. ఆకాశాన్ని అన్ని వేపులనుంచీ ముట్టడిస్తుంది. ఆకాశం ఆదర్శం. కళ అవకాశం. మారుతిరావు కేవలమన్వేషి. నిరంతర పథికుడు. జీవితం పంచరంగుల కలల్ని విప్పింది. కొత్త కొత్త కథల్ని చెప్పింది .ఈ వృక్షానికి ఎన్నో పార్శ్వాలూ, ఎన్నో శాఖలూ మధ్య మధ్య మిణుక్కుమనే ఆకాశాలు...

## (గత సంచిక తరువాయి)

**ఉదయమే స్నానం చేసి** పెరట్లో తులసికోట ముందు ఎండలో జుత్తు ఆరేసుకుంటూ  అమ్మ చదివే రామాయణ కీర్తనలు యిప్పటికీ చెవుల్లో వినిపిస్తాయి. అమ్మ చాలా శ్రావ్యంగా పాడేది. రామాయణ, భాగవత పద్యాలు ఆమె నాలిక మీద ఉండేవి.

పెరట్లో కొబ్బరి చెట్టు కిందన మంచాలు వేసుకుని వెన్నెల్లో కదిలే మేఘాన్నిచూస్తూ పడుకోవడం అప్పట్లో అతి మధురమైన జ్ఞాపకం తెల్లవారేసరికి కొబ్బరి పూలు అభిషేకం చేసినట్టు రాలేవి. తెల్లవారుఝామునే లేచి మంచం దిగకుండానే అమ్మా, అమ్మమ్మా, పిన్నతల్లులూ కబుర్లు చెప్పుకునేవారు. కొన్ని చెవుల్లోకి దూరినా మగత నిద్ర ఆ మాటల్ని బయటికి నెట్టేసేది. భళ్ళున తెల్లవారిందనడానికి గుర్తు – కాఫీ చేస్తూ అమ్మ పాడే  స్తోత్రాల్లో ఓ విచిత్రమయిన స్తోత్రం యీ ధోరణిలో నడిచేది. "నీ మహాత్యము భీష్ముడికి తెలుసు, నీ భుజబలం కంసుడికి తెలుసు, నీ సౌందర్యము రాధకి తెలుసు, నీ ధర్మప్రవర్తన దృతరాష్ట్రుడికి తెలుసు" ఇలాగా సాగేది. నాకేమో ఇది విచిత్రంగా ఉండేది. మనస్సులో చిలిపిగా "నీ దొంగతనము గోపికలకు తెలుసు" అని ఎందుకు చదవకూడదో అనుకునేవాడిని. సంవత్సరాలు గడిచాక అదీ స్తోత్రమేనని,

దాన్ని 'నిందాస్తుతి ' అంటారని తెలుసుకున్నాను.

ఎలా అబ్బాయో చిన్నతనంలో రకరకాల బూతులు అబ్బాయి. ఎనిమిదో ఏటివరకు నాకు పెద్ద జడ ఉండేది. ప్రతీవారం నాకు అమ్మపోసే తలంటు పొరుగువాళ్ళకి బూతులద్వారా తెలిసేది "అన్నపూర్ణమ్మా తలంటా" అని రామానుజం అనే పొట్టి, పొరుగు యిల్లాలు – కిటికీలోంచి అడగడం నాకు గుర్తు.

విపరీతమయిన అల్లరి చేసేవాడిని. ఆదివారం మధ్యాహ్నం విధిగా నూనె నరసమ్మ వచ్చేది. ప్రశస్తమయిన సామర్లకోట నూనె, పప్పునూనె – అన్నీ నేను పెద్దవాడినయేదాకా నరసమ్మే ఇచ్చిన గుర్తు "గొల్లపూడి వారబ్బాయి వస్తున్నాడు డబ్బాలు జాగ్రత్తమ్మోయ్" అంటూ స్టీలు గంప దింపేది. ఆ గంపా, ఆ ముఖం నాకిప్పటికీ గుర్తే.

ఆదివారం కాస్త తీరుబాటు భోజనం అయాక మా నాన్నగారు విధిగా నన్ను తీసుకువెళ్ళి పక్కనే పడుకోబెట్టుకునేవారు. అంతా అయిదు నిముషాలు. ఆయన గుర్రుపెట్టగానే లేచిపోయేవాడిని. ఆ సందర్భాలలో చిన్నం వారి వీధి గాలిలో వయొలిన్ వాద్యం తేలి వచ్చి చెవులను తాకేది. అప్పుడు తెలియదు కాని – అది 'తోడి' రాగమని ఇప్పుడు గుర్తుపట్టగలను. తోడి విన్నప్పుడల్లా నా చిన్నతనం కళ్ళముందు మెదులుతుంది.

కార్తీక సోమవారాలు ఏక భుక్తం పెద్దవాళ్ళతో సమానంగా మొదలుపెట్టేవాడిని. దైవభక్తి, చింతన మా అమ్మ ద్వారా సంక్రమించిన లక్షణాలు. నాలుగు దాటినప్పటినుంచీ కడుపులో ఎలకలు పరిగెత్తేవి. భక్తిని మరచిపోయి గోపపెట్టేసేవాడిని. ఆకాశాన మొదటి నక్షత్రం కనిపిస్తే చాలు. కంచం మీద కలియబడిపోయేవాడిని.

విశాఖపట్నంలో మా నాన్నగారు ఇంపీరియల్ కెమికల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో మేనేజరుగా పనిచేసేవారు. పాత పోస్టాఫీసు పక్కనుంచి హెచ్.ఎం. ఎస్ బేకరీ పక్కనుంచి పాత కర్ర వంతెన మీదుగా వెళ్తే అందమయిన విశాలమైన ఆవరణలో ఆఫీసు ఉండేది. చంద్రయ్య, రాఘవులు అని ఇద్దరు బంట్రోతులు. నా చిన్నతనంలో  నాన్నగారి హోదా, సంపాదనా మూడు పువ్వులూ, ఆరు కాయలుగా ఉండేది ఆయనకి అపరిమితమైన బంధుప్రీతి. మా చిన్నాన్నలూ, పిల్లలూ అంతా మా ఇంట్లోనే ఉండేవారు. అందరికీ మా అమ్మే వంట. బంధువర్గంలో పిల్లల చదువులకీ, యితరత్రా సహాయం చేసేవారు. తనకి ఉన్నదాంట్లోనే గుప్తదానాలు చేసేవారు. ఆయన దగ్గర ఎప్పుడూ బ్యాంక్ నుంచి తెచ్చిన కొత్తనోట్లు ఉండేవి. నేను బాగా సంపాదించే రోజుల్లో కూడా ఊరికి వెళ్ళేటప్పుడు  'డబ్బు కావాలా?' అని అడిగేవారు. ఇవ్వడంలో ఎప్పుడూ ఆయన చెయ్యి పైనే ఉండేది. కొత్త నోట్లు తీసి ఇచ్చేవారు. అది నా భాగ్యం. ఆయన పోయాక – ఆయన సొరుగులో కొన్ని వందల తాజా నోట్లు కనిపించాయి. ఇందిరాగాంధీ బొమ్మతో ఐదు రూపాయల నాణాలు ఉన్నాయి. ఒక నాణెం ఇప్పటికీ నాదగ్గర ఉంది .ఆయన నోటితో ఏనాడూ లేదన్నమాట రాలేదు. అన్నీ ముందుగా ప్లాన్ చేసుకునేవారు

తనకు తానె.

విజయనగరం నుంచి విశాఖపట్నం వచ్చాక, నా చదువు చిన్నం వారు వీధిలో ఎలిమెంటరీ బడికి బదిలీ అయింది. దాన్ని 'దుంపల బడి ' అనేవాళ్ళం. సరిగ్గా 30 గజాల దూరం మా ఇంటికి. పిల్లల కేకలు, అరుపులూ అక్కడినుంచి మా ఇంటికి వినిపించేవి. ఉదయం ఏడున్నరకి బడి. పాఠాలు మొదలయి, పెద్ద బాలశిక్షలో పద్యాలు వల్లె మొదలయేసరికి ఎనిమిదిన్నర అయేది. తొమ్మిది గంటల నుంచి కణకణ ఆకలి మొదలయేది. మా నాన్నగారు భోజనానికి విస్తరి ముందు కూర్చునే సమయానికిమా చిన్నానలు ఎవరో ఒకరు పట్టు పెంచెతోనే బడికి వచ్చేవారు నన్ను పంపమని. నిజానికి ఆయన రాకకి ఎదురుచూసేవాడిని. పూర్ణయ్య పంతులుగారని మా మేష్టరుగారు. నవ్వుతూనే నన్ను వెళ్ళమనే వారు. మా నాన్నగారితో భోజనం నా దినచర్య. ఈ దినచర్య నాతో దాదాపు 60 సంవత్సరాలు నిలిచింది. ఇప్పటికీ అదే అలవాటు. భోజనం అయాక ఆఖరి గంట వరకూ ఇంట్లోనే తచ్చాడేవాడిని. చదువులో కాస్త శీతకన్ను వేసే అలవాటు అప్పటినుంచే నిలదొక్కుకుంది.

పక్కవాటాలో కమలమ్మగారు వారిది బళ్ళారి. మా అమ్మ పురాణం చదివితే ఆమె టీకా చెప్పేవారు. వస్తే ఒకరిద్దరు పొరుగు యిల్లాళ్ళు వచ్చేవారు. లేకపోతే వారిద్దరే. ఒకరికొకరు చెప్పుకునేవారు.

నాన్నగారు ప్రతిదినం హిందూ రీడింగు రూముకి  పెద్దా చిన్నా అందరిలోనూ ఆయన పాపులర్. ఇప్పటికీ నా వయస్సువాళ్ళు 'మీ నాన్నగారు మా ఫ్రెండ్ ' అంటూంటారు. కారంస్‌లో ఆయన ఛాంపియన్. ఆదివారం మధ్యాహ్నం మాత్రం కందులవారింట్లో నాలుగయిదు గంటలు పేకాట ఉండేది. పది పన్నెండు రూపాయల డబ్బు కూడా చేతులు మారేదేమో. పేకాట, మధ్యాహ్న భోజనాలు అందరూ బస్సులో తిరిగి రావడం నాకు అందమైన జ్ఞాపకం.

ధనుర్మాసానికి మా పక్కింటి కళింగ వైష్ణవులు వైశ్యులు విధిగా తిరుప్పావు చదివి వేడి వేడి పొంగల్ పెట్టేవారు. తిరుప్పావు అర్ధమయ్యేది కాదుకాని పొద్దున్నే వేడి పొంగల్ మహారుచిగా ఉండేది. పొంగల్ తినడం – నా పదో యేట మొదటిసారిగా.

అలాగే చిన్నం వారి వీధి చివరన కాళీబాబుగారు, ఆయనా వైశ్యులు. అసలు పేరు కొల్లూరు వెంకటరత్నం కలకత్తాలో ఉండి రావడం వల్లనేమో. దసరాకి దుర్గానవరాత్రులు జరిపేవారు. ఆయనది కలప వ్యాపారం. దుకాణంలోనే ఒక పక్క తాలింఖానా నడిపేవారు. నవరాత్రుల్లో మొదటిసారి అక్కడే ఆపిల్ రుచి చూశాను.

ఇక అమ్మతో కలిసి బొమ్మల కొలువులకి వెళ్ళడం కేవలం మొక్క శనగల కోసమే.

దీపావళి వచ్చిందంటే పచ్చిపులుసు సన్నయ్య దుకాణం (పప్పుల వీధి మొగిలో) చాలా రద్దీగా ఉండే గంధకం, సురేకారం, ఆముదం, బీడు అన్నీ అమ్మేవారు.వాటిని ఎండబెట్టి, వస్త్రకాళితం పట్టి ఆముదం వేసి సరైన పాళ్ళలో కలిపేవాళ్ళం. అంతకుముందే కాగితం గొట్టాలు రకరకాల సైజుల్లో సిద్ధం చేసేవాళ్ళం. పెద్ద పనితనం లేకపోయినా మతాబాలు పువ్వులు రాల్చేవి. ఆముదం ఎక్కువయితే పొగలు చుట్టేసినా కాని, సిసింద్రీలు కట్టాలని సరదాగా ఉండేది. అవి చర్రున గాలిలోకి లేస్తే చుట్టుపక్కల వాళ్ళముందు గర్వంగా ఉండేది. కొన్ని చేతుల్లోనే చీదేసేవి. అప్పుడు వేళ్ళు కాలినా ధైర్యం నటించేవాడిని. తెల్లవారేసరికి అమ్మకి దొరికిపోయేవాడిని. తారాజువ్వల మీదకి మనసుపోయేది కాని పెద్దవాళ్ళు ఒప్పుకునేవారుకాదు.

ఈలోగా అమ్మ ఆముదం కొమ్మకి నాలుగు దీపం వత్తులు చుట్టి, దీపం వెలిగించి "దిబ్బా దిబ్బా దీపావళీ మళ్ళీ వచ్చే నాగుల చవితి" అంటూ నా చేత నేలమీద కొట్టించేది. అది త్వరలో రాబోయే నాగదేవతకి ఆహ్వానం అన్నమాట.

దీపావళినాడు కట్టినవన్నీ కాల్చేయగా, కొన్నవీ అయిపోగా బీచ్‌కి వెళ్తే రెండు మూడు పేటల వాళ్ళు తారాజువ్వల పందాలు జరిపేవారు. చూడడానికి సరదాగా ఉన్నా వారి వీరావేశాలు చూస్తే భయమూ కలిగేది.

దీపావళి నాటి రాత్రి కాల్పులన్నీ అయిపోయాక కలిగే దిగులు వర్ణనాతీతం.

అవి రెండో ప్రపంచ యుద్ధం రోజులు. రాత్రివేళల్లో దీపాలార్పమని సి.ఆర్.పి వారు చీకటి పడ్డాక రోడ్డు మీదనుంచి కేకలు వేసేవారు. జపాన్ విమానాలు వచ్చే సూచనలుంటే డేంజర్ సైరన్ మ్రోగేది. ఎంత రాత్రయినా ఆ శబ్దం వినగానే మా నాయనమ్మా, మా అమ్మా అంతా మేడ మీంచి పరుగున వెళ్ళి కింద ఉన్న బొగ్గుల కొట్టాంలో తలదాచుకునేవాళ్ళం. మా అమ్మ నా చెవుల్లో దూది కూరేది. కాస్సేపటికి మళ్ళీ సైరన్ వినిపించాక బయటికి వచ్చేవాళ్ళం. ఆ రోజుల్లోనే హార్బరులో బాంబులు పడ్డాయి. మా నాన్నగారు నన్ను ఎత్తుకు తీసుకువెళ్ళి చూపించారు. ఒక్కొక్కప్పుడు పగలే సైరన్లు వినిపించేవి. చాలామంది ఊరు వదిలి వెళ్ళిపోయారు. విశాఖపట్నం రోడ్లు నిర్మానుష్యంగా ఉండేవి. ఆ దృశ్యాన్ని ఇప్పటి ప్రజలు ఊహించలేరనుకుంటాను.

మా వీధి చివర బుద్ధవరపు వారమ్మాయి మహాలక్ష్మి అని – నా క్లాసుమేటు. వాళ్ళ అరుగు మీద పూర్ణయ్య పంతులుగారు ప్రైవేటు పాఠాలు చెప్పేవారు. ఓ మధ్యాహ్నం సైరన్ మోగుతూంటే మా మేనత్త వచ్చి ప్రైవేటు మధ్యలోనే నన్ను తీసుకుపోయింది. ఆ రోజుల్లో ఉప్పుడు బియ్యం రేషన్ ఇచ్చేవారు. మా నాన్నగారితో రేషన్ షాపుకి టౌన్‌హాల్‌కి ఆనుకుని ఉన్న చెవలవారి వీధికి వెళ్ళిన జ్ఞాపకం ఉంది.

నా చిన్నతనంలో గుర్తున్న గురువు. నాకు సుమతీ శతకం చెప్పిన పూర్ణయ్య పంతులుగారు. ముతక ఖద్దరు పంచె,

లాల్చీ, చేతిలో గుడ్డసంచీ నలల్టి మనిషి. ఆయన్ని కలుసుకోవడం,బడి తర్వాత ఆయనతో మాట్లాడడమంటే ఎంతో గొప్పగా అనిపించేది. ఆయన నవ్వుతూ తల నిమిరితే వొళ్ళు పులకరించేది. ఆ రోజుల్లో ఆయనకి ఏ పదిరూపాయలో జీతం ఉండేదేమో. కాని దాదాపు 60 సంవత్సరాలు నా మనస్సులో నిలిచిన, జీవితాన్ని ప్రభావితం చేసిన గంభీరమైన వ్యక్తిత్వం ఆనాటి వ్యక్తిత్వం ఆనాటి గురువులది.

చిన్నం వారి వీధిలో పిల్లలది పెద్ద గ్యాంగు. అల్లరిలో నేనే ముందుండేవాడిని. మూలా సుందరం. కస్తూరి సూర్యనారాయణ, చిట్టిపంతులు, చాగంటి కామయ్య పంతులు – యిలాగ. ఆ వీధిలోకి వచ్చిన ఏ సైకిలు వెనకా ఎక్కకుండా ఏ ఒంటెద్దు బండి కాలిపీటమీద ఊరేగకుండా వదిలేవాళ్ళంకాదు. బండివాడు కంచీ ఝుళిపిస్తే పారిపోయేవాళ్ళం. సాయంకాలం శివాలయం వీధిలో శివాలయానికి అంతా బదిలీ అయేవాళ్ళం. నుదుటి నిండా విబూది పెట్టుకుని గుడి చుట్టూ పరుగులూ, సూర్యనారాయణగారని ప్రధాన అర్చకులు, మంత్రాలూ, పూజలూ తోచక పేము బెత్తం కొట్టుకుంటూ గర్భగుడిలోంచి బయటికి వచ్చేవారు. ఆయనకి దొరక్కుండా రావిచెట్టు వెనకా, గంటస్థంబం వెనకా నక్కేవాళ్ళం. కొన్నాళ్ళకి కొట్టి కొట్టి ఆ పేము బెత్తం చివర కుచ్చులాగ తయారయిపోయింది. ఆయన మా నాన్నగారి మిత్రులు పండగలకి పబ్బాలకి పిలిచేవాళ్ళం. భక్తిగా తల్లితండ్రులతో గుడిలో నిలిచేవాళ్ళం. సూర్యనారాయణగారి పెద్దబ్బాయి జగన్నాధరావు నా మిత్రుడు. సంవత్సరాల తర్వాత నేనో నాటక సమాజం నిర్వహించినప్పుడు నాతోపాటు నాటకాలు వేసేవాడు.

ఆదివారం తెల్లవారినప్పటి నుంచీ నాన్నగారిని 'కాకా' పట్టేవాడిని. ఎందుకో ఆయనకి అర్ధమయిపోయేది. నాన్నగారిని ఎన్నిరకాలుగా ఊదరగొట్టాలో అన్ని రకాలుగా ప్రయాసపడేవాడిని. ఇదంతా కేవలం మూడు అణాల కోసం. ఆ రోజుల్లో బీచ్‌లో కొత్తగా కట్టిన మినర్వా టాకీస్‌లో ఉదయం ఆటలు ఉండేవి. అన్నీ ఏక్షన్ చిత్రాలు నాడియా, జాన్‌కేవాస్ అందులో హీరోహీరోయిన్లు. చిరుకోపాన్నీ, విసుగునీ నటిస్తూ (నటనని ఇప్పుడర్ధం చేసుకోగలను) ఒక్కగానొక్క కొడుకు కోరికని కాస్త ఆలస్యంగా, తప్పనిసరయినట్టూ ఏ తొమ్మిదికో తీర్చేవారు. అప్పటికిక అరగంటే వ్యవధి. ఆ మూడణాలూ పుచ్చుకుని – చెంగల్రావుపేట పంజామీదుగా ఉరికేసేవాడిని. నేల టిక్కెట్టుకి విపరీతమైన రద్దీ. అతి శ్రమపడి గోడలెక్కి ఆ టిక్కెట్టు సంపాదించడం పెద్దయాక 'డిగ్రీ' సంపాదించిన ఆనందం.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

Post your comments